‘ఉపాధి’లో పచ్చ రాజకీయం!

- మేట్లను తొలగించి టీడీపీ వారికి పట్టం
- తొలగించడం దారుణమంటూ మేట్ల ఆవేదన


ఇచ్ఛాపుం రూరల్: లొద్దపుట్టిలో జరుగుతున్న ఉపాధి పని

సోంపేట/ఇచ్ఛాపురం రూరల్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలోకి కూడా కూటమి నాయకులు ప్రవేశించి పచ్చరాజకీయం అమలు చేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఉపాధి పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లకు సహాయ సహకారాలు అందిస్తూ ఉచిత సేవలు అందజేస్తున్న మేట్లను తొలగించి, తమవారిని నియమించుకునే పనిలో కూటమి నాయకులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో పాత మేట్లను తొలగించి కొత్తవారిని ఎంపిక చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు.

పదేళ్ల క్రితం..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నిబంధనల ప్రకారం మేట్ల వ్యవస్థను పది సంవత్సరాల క్రితం ఉపాధిహామీ పథకంలోకి తీసుకువచ్చారు. అప్పట్లో మేట్లకు అదనంగా నగదు అందజేశారు. తరువాత కేంద్ర ప్రభుత్వం మేట్లకు ఇచ్చే నగదు ప్రోత్సాహకాన్ని నిలుపుదల చేసింది. సంఘంలోని వేతన దారుల సంఖ్యబట్టి నగదు ప్రోత్సాహకం అందజేస్తామనే ఆదేశాలు రావడంతో ఉన్న మేట్లను తొలగించి తమవారికి పట్టం కట్టాలని కూటమి నేతలు నిర్ణయించుకున్నారు. తమకు అనుకూలమైన వారి పేర్లను ఇప్పటికే మండల స్థాయి ఉపాధిహామీ సిబ్బందికి అందజేసి మేట్లుగా నియమించాలని ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు తెలిసింది.

నిబంధనలకు విరుద్ధంగా..

మేట్ల ఎంపికలో జాతీయస్థాయిలో అధికారులు పలు నిబంధనలు ప్రవేశపెట్టారు. సంఘ సభ్యుడు అయి ఉండాలి. కనీసం చదవడం.. రాయడం వచ్చి 50 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలి. గత సంవత్సరంలో కనీసం 25 రోజులు పనిపూర్తిచేసిన వేతనదారుడుగా పని చేయడం.. సొంత మొబైల్ కలిగి ఉండాలి. ముఖ్యంగా సంఘసభ్యులు అందరూ చర్చించుకొని మేట్లను నిర్ణయించుకుని, వారి అనుమతితో రాత పూర్వకంగా ఉపాధిహామీ సిబ్బందికి అందజేయాలి. ఈ నిబంధనలు పట్టించుకోకుండా గ్రామాల్లోని కూటమి నాయకులు తమ ఇళ్ల వద్ద కూర్చొని, తమకు అనుకూలమైన వారి పేర్లను నిర్ణయించి వీరే మేట్లని చెబుతూ సంఘ సభ్యులకు తెలియజేస్తున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సుమారు వెయ్యమంది మేట్లు విధులు నిర్వహిస్తుండగా, వీరిలో సగం మందిని తొలగించి తమకు అనుకూలమైన వారిని నియమించేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు ప్రారంభించారనే ప్రచారం జరుగుతుంది. ఇప్పటికే ఇచ్ఛాపురం మండలంలో కొఠారీ, ధర్మపురం, బిర్లంగి, లొద్దపుట్టి, మశాఖపురం, తేలుకుంచి తదితర గ్రామాల్లో మేట్లను తొలగించి, కొత్త వారిని నియమించుకుంటున్నారు. అలాగే సోంపేట మండలంలో బెంకిలి, జింకిభద్ర, సోంపేట, కొర్లాం, బారువ, సిరిమామిడి, తాళభద్ర, పాలవలస తదితర పంచాయతీల్లో మేట్లను ఇప్పటికే తొలగించారు. మరికొన్ని గ్రామాల్లో ఇదేపరిస్థితి ఉంది.

‘ఉపాధి’లో రాజకీయాలు తగదు



ఉపాధిహామీ పథకంలో రాజకీయాలు చేయడం తగదు. వేతనదారుల సమావేశాలు నిర్వహించి, సంఘ సభ్యుల అనుమతితో మేట్ల ఎంపిక చేయాలి. రాజకీయంగా కొందరు పేర్లు ఎంపిక చేసి మేట్లుగా నియమించడం నిబంధనలకు విరుద్ధం. దీనిపై అధికారులు దృష్టి సారించాలి.

–డాక్టర్ నిమ్మన దాస్,
ఎంపీపీ, సోంపేట

నిబంధనల మేరకే ఎంపిక



సంఘంలోని వేతనదారుల ఇష్ట ప్రకారమే మేట్లను ఎంపిక చేస్తాం. సంఘ సభ్యుల తీర్మానం మేరకే ఈ ప్రక్రియ ఉంటుంది. వారి పేర్లే రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. సంఘంలోని సభ్యులు పాతమేట్లనే కొనసాగించాలంటే వారినే కొనసాగిస్తాం.

–శ్రీనివాసరెడ్డి,
ఏపీడీ, సోంపేట

శిక్షణ పొందినా తొలగించారు



ఎటువంటి ఫలితం ఆశించకుండా మేట్‌గా పనిచేశాను. మస్టర్లు వేయడం, కొలతలు తీయడం వంటి వాటిపై గతంలో శిక్షణ కూడా పొందాను. వైఎస్సార్‌సీపీ మద్దతుదారురాలిగా నాపై ముద్ర వేసి మేట్ నుంచి అన్యాయంగా తొలగించారు. మస్టర్లపై అవగాహన లేని వ్యక్తిని నియమించారు.

– పాల గీత, మశాఖపురం,
ఇచ్ఛాపురం మండలం

శ్రమశక్తి సంఘాల ద్వారా ఎంపిక



శ్రమశక్తి సంఘాల ద్వారా మేట్ల ఎంపిక జరుగుతోంది. ప్రస్తుతం శ్రమశక్తి సంఘాలు ఏర్పాటు చేయడం, వీటికి లీడర్లు ఎంపిక చేసి ప్రతీ 50 మందికి ఒక మేట్‌ను నియమిస్తాం. మేట్ల ఎంపికలో ఉపాధి సిబ్బంది పాత్ర లేదు.

– చల్లా శ్రీనివాసరావురెడ్డి,
ఏపీడీ, ఇచ్ఛాపురం క్లస్టర్

హామీలు పక్కన పెట్టి రెడ్ బుక్ పాలన తగదు

- వైఎస్సార్‌సీపీ నాయకులు


మాట్లాడుతున్న నాయకులు

టెక్కలి: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి కేవలం కక్ష సాధింపు చర్యల కోసం కూటమి నాయకులు రెడ్ బుక్ పాలన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అన్నెపు రామారావుతో పాటు నాయకులు విమర్శించారు. శనివారం కోటబొమ్మాళిలో వారు మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన తరువాత అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు ఆర్థిక సాయంతో పాటు ఉచిత బస్సు ప్రయాణం అని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చిన తరువాత వీటిని అమలు చేయడం మరిచిపోయారన్నారు. మద్యం దుకాణాలతో ఖజానా నింపుకుని ఇప్పుడు గ్రామాల్లో బెల్టు దుకాణాలను విచ్చలవిడిగా కొనసాగిస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన తరువాత పేద, సామాన్య వర్గాలపై భారం మోపే విధంగా నిత్యావసర ధరలతో పాటు విద్యుత్ చార్జీలను పెంచారని మండిపడ్డారు. అప్పులు తప్పా రాష్ట్ర ప్రయోజనాలకు చేసేందేమి లేదన్నారు. టెక్కలి నియోజకవర్గంలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నప్పటికీ ఆ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటువంటి కూటమి పాలనలో ప్రజలు ఇప్పుడే లెక్కలేని అవస్థలు పడుతున్నారని భవిష్యత్ రోజుల్లో మరెన్ని ఇబ్బందులు పడతారోనని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకట్రావు, మండల నాయకుడు రోణంకి ఉమా మల్లయ్య, పేడాడ వెంకట్రావు, నూక సత్యరాజ్, బొడ్డు అప్పన్న ఉన్నారు.

మే నుంచి చేపల వేట నిషేధం అమలు చేయాలి


మాట్లాడుతున్న శంభూరావు

వజ్రపుకొత్తూరు: సముద్రంలో చేపల వేట నిషేధాన్ని మే నెల నుంచి అమలు చేయాలని మత్స్యకార సంఘం నాయకుడు, మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గోసాల శంభూరావు ప్రభుత్వాన్ని కోరారు. పూండిలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. సంద్రంపై ఆధారపడి బతుకుతున్న మత్స్యకారులకు ఏటా ప్రకృతి వైపరీత్యాలు, నిషేధ కాలంతో నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చక్కగా వేట సాగే సమయంలో నిషేధం అమలు చేయడం వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారన్నార. చేప, రొయ్యిల పునరుత్పత్తి వాస్తవానికి ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు 61 రోజులు పాటు ఉంటుందని నిపుణులు చెబుతుంటారని.. మత్స్య సంపదను పెంచేందుకు ఇది చాలా అవసరమన్నారు. దీన్ని తాము కాదనడం లేదని చెప్పారు. అయితే ఏడాదిలో 61 రోజులు నిషేధ కాలం, మరో నెల రోజులు పాటు తుఫాన్‌ల సీజన్, మరో రెండు నెలల పాటు వేట సాగని దుస్థితిని ఎదుర్కొంటున్నామన్నారు. మిగిలిన రోజుల్లో వేట చేయడం వల్ల పెద్దగా చేపలు ఉండవని వివరించారు. తమ సమస్యపై దృష్టిసారించి మే నుంచి వేట నిషేధం అమలు చేయాలని కోరారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ఇచ్ఛాపురం రూరల్: లొద్దపుట్టి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణను శుభ్రం చేస్తున్న మహిళలు


కంచిలి: బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల మానవహారం


కంచిలి సచివాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో వి.తిరుమలరావు


కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణను శుభ్రంచేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు


ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం పట్టణంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ ఎన్.రమేష్, సిబ్బంది

పరిశుభ్రతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని వక్తలు అన్నారు. ‘స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర’కార్యక్రమాన్ని పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా పరిసరాలను శుభ్రం చేయడం చేశారు. పరిశుభ్రతపై అవగాహన, ప్రతిజ్ఞ చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. అధికారులు, అధికారులు భాగస్వామ్యమయ్యారు.

–సాక్షి నెట్‌వర్క్

ఆరోగ్యానికి కలబంద దోహదం



బూరగాంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

కంచిలి: కలబంద వినియోగంతో ఆరోగ్యకరంగా ఉండగలరని ఎంఈవో–1 ఎస్.శివరాంప్రసాద్ అన్నారు. బూరగాం ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి గ్రామంలో ఏపీ గ్రీన్ కార్ప్స్ కార్యక్రమాన్ని శనివారం చేపట్టారు. పాఠశాలను తనిఖీ చేస్తున్న సందర్భంలో మైదానంలో కనిపించిన కలబంద మొక్కలను విద్యార్థులకు పరిచయం చేసి ఉపయోగాన్ని వివరించారు. కలబంద మొక్కలను ఉపయోగించడం వలన థైరాయిడ్ సమస్య, కాళ్ల చేతులు వాపులను , శరీర బరువును తగ్గిస్తుందని, రక్తప్రసరణ, రోగనిరోధక శక్తిని పెంచుతోందని అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

నిరుపేదకి రూ. లక్షన్నర సాయం


బాధితురాలికి ఆర్థికసాయం చేస్తున్న గ్రామస్తులు

కాశీబుగ్గ: మందస మండలం దున్నపూరు పంచాయతీ మొగలిపాడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన తెప్పల ధనలక్ష్మి ఇటీవల మెదడులో నరాలు చిట్లి ఆపస్మారకస్థితిలోకి వెళ్లిపోయారు. ప్రస్తుతం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఆమె పూర్తిగా కోలుకోవడానికి వైద్యం కోసం సుమారు రూ.పది లక్షలు ఖర్చవుతోందని డాక్టర్లు వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మొగలిపాడు గ్రామస్తులు రూ.1.50 లక్షలు సేకరించారు. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి శనివారం అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో దున్న రామారావు మాస్టర్, గ్రామ కమిటీ అధ్యక్షులు నూకల ఉమామహేశ్వరరావు, నూకల హేమసుందర్, కమిటీ సభ్యులు చిరంజీవి, రాజశేఖర్ ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ నెల 12వ తేదీ కిట్టిలపాడు జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం మండలం నల్లబొంతుకు చెందిన మామిడిపల్లి సతీష్ (23) తీవ్రంగా గాయపడి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందినట్లు టెక్కలి పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఏడాదిన్నర బాబు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేయాలి


బొరివంక సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కవిటి: విద్యార్థులను ఆకట్టుకునేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని బొరివంక స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సనపల రామకృష్ణ అన్నారు. కవిటి, బొరివంక, ముత్యాలపేట, రాజపురం, ఆర్.బెలగాం, మాణిక్యపుర జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు శనివారం నిర్వహించారు. విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేయడంలో అనుసరించాల్సిన పద్ధతులపై రిసోర్సుపర్సన్‌లు మెలకువలు అందించారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు బి.మల్లేశ్వర రావు, శివరాంప్రసాద్‌పాఢి, సుమలత, శాంతి, నమితాకుమారి పాల్గొన్నారు.

వైభవంగా చక్రధరస్వామి సుదర్శనయాగం


సుదర్శన హోమం చేస్తున్న దృశ్యం

కవిటి: బెజ్జిపుట్టుగలోని చక్రధర పెరుమాళ్ల స్వామి ఆలయ మూడో వార్షికోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ముందుగా సుప్రభాత సేవ, నిత్యదర్శనాలు, అభిషేకాలు, అర్చన, నవకలశస్థాపన పూజలను ఆగమశాస్త్ర సంప్రదాయంలో నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను యాగశాలలో ఉంచి విశేష పూజలు చేశారు. లోకకల్యాణార్థం వర్షాలు సస్యానుకూలంగా కురిసి పాడిపంటలతో ప్రజలంతా సుఖసంతోషాలు ఆరోగ్యంతో జీవించాలని కాంక్షిస్తూ సుదర్శన హోమాన్ని నిర్వహించారు. స్వామి వారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పి.కృష్ణారావు, పి.శ్రీరాంబాబు, పి.అనసూయమ్మ పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్‌లో వార్షిక తనిఖీలు


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ అప్పారావు

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు పోలీస్ స్టేషన్‌ను కాశీబుగ్గ డీఎస్పీ వి.వెంకట అప్పారావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైమ్ రికార్డులు, నమోదవుతున్న కేసుల వివరాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని, ఎప్పటికప్పుడు ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించాలని ఎస్ఐ బి.నిహార్‌ను ఆదేశించారు. బంగారం షాపుల్లో జరుగుతున్న చోరీలపై దృష్టిసారించాలన్నారు

వంతెనను పరిశీలించిన కలెక్టర్


వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులు

నందిగాం: మండలంలోని గొల్లూరు వద్ద వంశధార కాలువపై కూలిపోయిన వంతెనను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ శనివారం పరిశీలించారు. ఈ వంతెనను గొల్లూరు–రాంపురం రహదారిలో వంశధార ఎడమ ప్రధాన కాలువపై గొల్లూరు సమీపంలో 1989లో నిర్మించారు. అయితే ఈ వంతెన 2022లో కూలిపోయి రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో అక్కడ తాత్కాలికంగా ఇనుప వంతెన ఏర్పాటు చేశారు. రాకపోకలకు అంతరాయం కలుగుతున్న దృష్ట్యా ఉపాధినిధులతో శాశ్వత వంతెన నిర్మించాలని వంశధార అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. పరిశీలనలో వంశధార ఈఈ శేఖరరావు, తహసీల్దార్ సోమేశ్వర రావు, ఎంపీడీవో రాజారావు ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీల ఏర్పాటు


పెదబడంలో మాట్లాడుతున్న రామానంద స్వామి

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు బీజేపీ ఇన్‌చార్జి రామనంద స్వామి శనివారం తెలిపారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీ ఏడో వార్డు పరిధి అంతరకుడ్డ, గుల్లలపాడులో 213 బూత్‌కు, పెదబడంలో 204 బూత్‌కు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు యజెఘని, బీజేపీ నాయకులు తిరుపతిరావు, అట్టాడ బాబ్జి పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం



కంచిలి మండల కేంద్రంలోని రాధాకృష్ణ ఆలయం 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

–కంచిలి

ఆరోగ్యంపై అవగాహన



టెక్కలి పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కె.కొత్తూరు గ్రామంలో శనివారం ఇంటింటా అవగాహన కల్పించారు. స్వచ్ఛత ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ పీవోలు ఎస్.వి.మారుతిప్రసాద్, అధ్యాపకులు కె.పి.ఎస్.సూర్యనారాయణ, శాక్ ఇన్‌చార్జి జె.సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

–టెక్కలి

పాఠశాల సందర్శన



నందిగాం మండలం లఖిదాసుపురం ఉన్నత పాఠశాలను డీఈవో ఎస్.తిరుమల చైతన్య శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రార్థన, తరుగతుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతను, తరగతి గదిలో ప్యానల్ బోర్డు ద్వారా అంగ్లం నేర్చుకునే విధానాన్ని పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీఫైనల్ పరీక్షలను పర్యవేక్షించారు. టెస్ట్ పరీక్షలపై ప్రధానోపాధ్యాయులు చిలుకు క్రిష్ణారావుతో సమీక్షించారు. విద్యార్థులకు ప్రశ్నలు అడిగి వారికి ప్రోత్సాహకంగా నగదు బహుమతి అందజేశారు. పిల్లలతో కలిసి రాగి జావతాగి సంతృప్తి వ్యక్తం చేశారు.

–నందిగాం

విద్యా సామగ్రి అందజేత



ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమని సోంపేం మండల విద్యాశాకాధికారులు ఎస్.జొరాడు, జె.కృష్ణంరాజు అన్నారు. పట్టణంలోని ఇందిరమ్మపేట ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు జైభీమ్ సేన ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్ర పటంతో కూడి నోటు పుస్తకాలు, విద్యాసామాగ్రిని శనివారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.విజయనిర్మల, సంఘజిల్లా అధ్యక్షుడు బుస్క ఈశ్వరరావు, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

–సోంపేట

ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయశాఖాధికారి త్రినాథ స్వామి


ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఏవో భార్గవి

టెక్కలి రూరల్: ప్రతి రైతు గ్రామంలోని రైతు సేవా కేంద్రాలను సంప్రదించి ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురంలోని రైతు సేవా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర సంక్షేమ పథకాల లబ్ధి కోసం భూమి ఉన్న ప్రతి రైతు ఈ గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకుంటే 11 అంకెలతో కూడిన నంబర్‌ను కేటాయిస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సుచించారు. మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు ఉన్నారు.

నమోదు ప్రక్రియ పరిశీలన

ఇచ్ఛాపురం రూరల్: కేధారిపురం, బాలకృష్ణాపురం, మండపల్లి రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్న రైతు గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారి టి.భార్గవి శనివారం పరిశీలించారు. రైతులందరూ తప్పనిసరిగా ప్రత్యేక నంబర్‌ను నమోదు చేసుకోవాల్సిందేనని పేర్కన్నారు.

తగ్గిన చికెన్ అమ్మకాలు!

ఇచ్ఛాపురం టౌన్: కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకడంతో చికెన్ అమ్మకాలు అమాంతంగా తగ్గాయి. ఈ ప్రభావం ఇచ్ఛాపురం పైకూడా పడింది. రెండు రోజులుగా 50 శాతం అమ్మకాలు తగ్గాయని హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ ప్రభావం లేనప్పటికీ వినియోగదారుల్లో కొంత ఆందోళన మొదలైంది. దీంతో చికెన్ వ్యాపారం సక్రమంగా సాగడం లేదని, కోడిగుడ్డు అమ్మకాలు కూడా తగ్గాయని ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వ్యాపారి రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు


రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేపడుతున్న సిబ్బంది

ఆమదాలవలస: పట్టణంలో ప్రస్తుతం ఉన్నటువంటి వేర్ హౌస్ గోదాంల స్థానంలో, అదనంగా నాలుగు వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని స్థానిక వేర్‌హౌస్ గోదాంల మేనేజర్ వేణుగోపాలరావు తెలిపారు. వేర్ హౌసింగ్ గోదాములకు రోడ్డు వేసేందుకు, నూతన గోదాం నిర్మాణం చేపట్టేందుకు అధికారులు శనివారం సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది ఇప్పటివరకు 11,890 మెట్రిక్ టన్నుల బియ్యం వచ్చాయన్నారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో ప్రస్తుతం 1000 మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వ చేసేందుకు సామర్థ్యం ఉందన్నారు. ఈ ఏడాది బియ్యం సేకరణ సజావుగా జరుగుతోందని పేర్కొన్నారు. ఇటీవల టెక్నికల్ అధికారులు గోదామును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. మెయిన్ రోడ్ నుంచి రోడ్డు వేసేందుకు సిబ్బంది సర్వే నిర్వహించినట్లు మేనేజర్ వేణుగోపాలరావు తెలిపారు.

క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి

టెక్కలి: ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బొడ్డేపల్లి నేతాజీరావు కోరారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. క్లస్టర్ సమావేశాలను సాయంత్రం వేళల్లో నిర్వహిస్తుండడంతో మహిళా టీచర్లు ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. అంతే కాకుండా విద్యార్థులను తొందరగా ఇళ్లకు పంపడం వలన అభ్యసన విషయంలో ఇబ్బందులు తప్పవన్నారు.